ప్రజాశక్తి

శుక్రవారం 15 సెప్టెంబరు 2023 — 8 పేజీలు

శ్రీకాకుళం

పోటెత్తిన వంశధార

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- రాత్రి 8 గంటలకు గరిష్టంగా 71 వేల క్యూసెక్కుల ప్రవాహం
- కొత్తూరు మండలంలో పలు గ్రామాల్లోకి వరద నీరు
- క్రమేణా తగ్గుముఖం
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, కొత్తూరు, జలుమూరు

ఒడిశాలో కురుస్తున్న భారీ వర్షాలకు వంశధార పోటెత్తింది. ఉదయం ఆరు గంటల నుంచి క్రమేణా నీటి ప్రవాహం పెరిగి ఉదయం 11 గంటల ప్రాంతంలో 25 వేల క్యూసెక్కులకు చేరింది. 11.30 గంటలకు ఒక్కసారిగా 40 వేల క్యూసెక్కులు దాటిపోవడంతో అధికారులు ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వరద ప్రవాహం ప్రవాహం పెరుగుతుండడంతో వంశధార ప్రాజెక్టు సర్కిల్ ఇఇ డి.ఎస్ ప్రదీప్ హిరమండలం గొట్టాబ్యారేజీ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఒడిశా అధికారులతో మాట్లాడారు. సాయంత్రం ఆరు గంటల సమయానికి నదిలో ఇన్‌ఫ్లో 73,770 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 68,882 క్యూసెక్కులుగా ఉంది. అక్కడి నుంచి క్రమేణా వరద తగ్గుముఖం పట్టింది. రాత్రి ఎనిమిది గంటలకు ఇన్‌ఫ్లో 71,690 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 70,217 క్యూసెక్కులుగా ఉంది.

వంశధారకు వరద పోటెత్తడంతో కొత్తూరు మండలంలని నదీ పరివాహక గ్రామాలైన పెనుగోటివాడ, మాతల, నివగాం, సోమరాజపురం, (మిగతా...2లో)

లక్ష్యసాధనలో వెనుకబడితే కఠిన చర్యలు

గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, జలుమూరు

గృహ నిర్మాణాల లక్ష్యసాధనలో వెనుకబడిన ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దివాన్ మైదీన్ హెచ్చరించారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో గృహనిర్మాణ శాఖ అధికారులతో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌తో కలిసి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా దేశంలో (మిగతా...2లో)

టిడిపిలో జనసేన విలీనం తప్పదు

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

తెలుగుదేశం పార్టీలో జనసేన పార్టీ కలిసి పోతుందని ఎప్పుడో తాను చెప్పానని, నేడు అది రుజువవుతోందని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ 15వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడుకు (మిగతా...2లో)

మాట్లాడుతున్న వెంకట్ ఉజ్వల్

జాతీయ సమగ్రత కోసం పాటుపడాలి

సరుబుజ్జిలి: జాతీయ సమగ్రత కోసం పాటుపడాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కె.వెంకట్ ఉజ్వల్ అన్నారు. సెట్‌శ్రీ, యంగ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యాన రొట్టవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ పక్షోత్సవాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భాష హిందీ నేర్చుకోవడం ద్వారా దేశంలో ఎక్కడికైనా వెళ్లవచ్చన్నారు. స్వాతంత్య్ర సముపార్జనలో హిందీ కీలకభూమిక పోషించిందని గుర్తుచేశారు. సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు మాట్లాడుతూ జాతీయ సమైక్యత సమగ్రతలో యువతను ఏకతాటి పైకి తేవడంలో హిందీ పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రామకృష్ణారావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, యంగ్ ఇండియా డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్స్ పోస్టుల భర్తీ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను గెస్ట్ లెక్చరర్స్‌తో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ విభాగం ఆదేశాల మేరకు డిగ్రీ, పిజి కోర్సుల బోధనకు సంబంధించి 13 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న తెలుగు, రాజనీతిశాస్త్రం, హిస్టరీ, కంప్యూటర్ అప్లికేషన్స్, జువాలజీ, బోటనీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఒరియా, ఎలక్ట్రానిక్స్, ఫిలాసఫీ, కామర్స్ ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పిహెచ్‌డి, నెట్, సెట్ అర్హతలు కలిగి పిజిలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఈ పోస్టులకు అర్హులని స్పష్టం చేశారు. దరఖాస్తులను ఈనెల 16వ తేదీ లోగా అందజేయాలని తెలిపారు. అభ్యర్థులకు ఈనెల 20న ఇంటర్వ్యూలు నిర్వహించి, సిసిఇ నిబంధనల మేరకు ఎంపిక నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ జి.రాజశేఖర్ ఫోన్ నంబరు 9000506595ను సంప్రదించాలని సూచించారు.

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. రక్తంలోని ఎర్ర రక్తకణాలను రక్తహీనత, ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి, ప్లాస్మాను బ్లీడింగ్ డిజార్డర్ వ్యాధితో ఉన్న వారికి, ప్లేట్‌లెట్స్‌ను డెంగ్యూ వంటి జ్వరంతో బాధపడే వ్యక్తికి ఇవ్వడం ద్వారా ముగ్గురి ప్రాణాలను కాపాడినట్లవుతుందని తెలిపారు. ఇంజినీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జలవనరులశాఖ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా రక్తదానం చేసేందుకు జలవనరుల శాఖ అధికారులు, సిబ్బంది ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని శాఖలు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

జిల్లాలో 170 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉన్నందున ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రమాదాలకు గురైన బాధితులకు సరిపడా రక్త నిల్వలు లేవన్నారు. రక్తదానం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందనే అపోహ చాలామందిలో ఉందని, కానీ రక్తదానం ద్వారా ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యవంతులు మూడు నెలలకోసారి రక్తదానం చేయొచ్చని చెప్పారు. తొలుత జలవనరుల శాఖ కార్యాలయ ప్రాంగణంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, జలవనరుల శాఖ, వంశధార పర్యవేక్షక ఇంజినీర్లు డోల తిరుమలరావు, బి.సుధాకర్, కార్యనిర్వాహక, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు, సిబ్బంది, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, పి.చైతన్యకుమార్, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మంత్రికి సమస్యలను వివరిస్తున్న విజయ

రైల్వే సమస్యలు పరిష్కరించాలి

రైల్వేశాఖ మంత్రిని కోరిన జెడ్‌పి చైర్‌పర్సన్

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నెలకొన్న రైల్వే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ కోరారు. న్యూఢిల్లీలో గురువారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. పలాస-విశాఖ-పలాస రైలు నంబరు 08531-08532ను బరంపురం వరకు పొడిగించాలని కోరారు. అమృత్ భారత్ పథకం కింద సోంపేట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో పూరీ, అహ్మదాబాద్, గాంధీనగర్, యశ్వంత్‌పూర్ రైలును నిలుపుదల చేయాలని కోరారు. సోంపేటలో ఫలక్‌నుమా, జునగఢ్ రోడ్ ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాడుపూడి, బారువ రైల్వేస్టేషన్లలో బరంపురం-విశాఖ రైలును నిలుపుదల చేయాలని కోరారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని ఎల్‌సి గేటు వద్ద ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కొళిగాం రోడ్డులో ఆర్‌అండ్‌బి రోడ్డు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. జాడుపూడి రైల్వేస్టేషన్ పశ్చిమ భాగంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు ఉత్తరాన బాహుదా నదికి దగ్గరలో ఉన్న అండర్ పాసేజ్ బ్రిడ్జి విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు మంత్రికి రాయబారం

ప్రజాశక్తి - మందస

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఈనెల 16వ తేదీన మంత్రి అప్పలరాజుకు రాయబారం కార్యక్రమం చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని హరిపురంలో రాయబారం పోస్టర్లను గురువారం పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వెల్ఫేర్ బోర్డును పూర్తిగా మూసేశారని చెప్పారు. 1996లో కేంద్రం చేసిన వెల్ఫేర్ చట్టంలో అనేక అంశాలున్నా, కొన్ని మాత్రమే రాష్ట్రంలో అమలు చేస్తున్నారని తెలిపారు. ఉన్న కొన్నింటినీ ఆపేస్తే కార్మికుల సంక్షేమం సంగతి ఏంటని ప్రశ్నించారు. వృద్ధాప్యంలో పింఛను ఇవ్వాలని చట్టంలో ఉందని, దీన్ని కలుపుకొని మిగతా బెనిఫిట్స్ అమలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కె.కొర్లే, బలరాం, మేస్త్రీలు దుర్యోధన, సోమేశ్వర, దానయ్య, కుర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

జలుమూరు : వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ సత్యం

పోటెత్తిన వంశధార

మదనాపురం, ఆకులతంపరలో పొలాలు ముంపునకు గురయ్యాయి. రహదారులపైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పొలాలకు వరద పోటెత్తడంతో సుమారు 500 ఎకరాలు వరి , అరటి, చెరకు పంట ముంపునకు గురైందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేయకపోవడంతో ఎక్కువ నష్టం వాటిల్లిందని చెప్పున్నారు.

కొత్తూరు : మదనాపురంలో ముంపునకు గురైన పంట పొలాలు

జలుమూరు మండలంలోని నదీ పరివాహక ప్రాంతాలైన కొమనాపల్లి, సురవరం, అందవరం గ్రామాల్లో తహశీల్దార్ బి.సత్యం పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వంశధార నదిలో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పి.పారినాయుడు, విఆర్‌ఒలు గోపి, విజయబాబు జాగ్రత్తలు చెప్పారు.

అధికారులు అప్రమత్తం

వంశధార ఉధృతంగా ప్రవహించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్, నీటిపారుదల శాఖ, విపత్తుల నివారణ సంస్థ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొత్తూరు, భామిని, హిరమండలం, ఎల్.ఎన్ పేట, సరుబుజ్జిలి, పోలాకి, ఆమదాలవలస, జలుమూరు, నరసన్నపేట తహశీల్దార్లు వారి పరిధిలోని ముంపు ప్రాంతాల ప్రజలకు చాటింపు వేయించాలని సూచించారు. వరద నేపథ్యంలో కలెక్టరేట్‌లో 08942-240557 ఫోన్ నంబరుతో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా కాశీనగరం నుంచి నీటి ప్రవాహం అధికంగా ఉన్నందున వంశధార నదిలో నీరు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అందుకు తగ్గట్టు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావుతో మాట్లాడుతూ వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. అధికారులందరూ వరద ముంపు ప్రాంతాల తాజా పరిస్థితిని తెలుసుకుంటూ 24 గంటలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలను అప్రమత్తం

మొదటిపేజీ తరువాయి

చేయడం, వరద సహాయక చర్యల్లో వాలంటీర్లను వినియోగించుకోవాలని చెప్పారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఎస్‌పి జి.ఆర్ రాధిక, డిఆర్‌ఒ గణపతి, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహమ్మద్ దివాన్ మైదీన్

లక్ష్యసాధనలో వెనుకబడితే కఠిన చర్యలు

ఎక్కడా లేని విధంగా 30 లక్షల గృహ నిర్మాణ పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలందరికీ మంజూరు చేశామని, ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ చరిత్రలో ఒకేసారి రూ.15 వేల కోట్లతో ఇళ్లు నిర్మించడం ఇదే ప్రథమమన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిలో రాష్ట్రంలో జిల్లా మూడో స్థానంలో నిలిచిందన్నారు. జిల్లాకు మంజూరైన 75,840 గృహాల్లో 25 వేలు పూర్తయ్యాయని తెలిపారు. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.ఐదు వేల కోట్లు వ్యయం చేస్తున్నామని చెప్పారు. ఇళ్ల నిర్మాణంలో గృహనిర్మాణ శాఖ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతి, డ్వామా పీడీ చిట్టిరాజు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా అధికారులు ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ నాగేశ్వరరావు, అర్బన్ సహాయ ఇంజినీర్ గణేష్ ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు మండలం చల్లవానిపేటలో జగనన్న కాలనీని పరిశీలించారు. కాలనీ ముఖద్వారాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటి వద్ద వ్యక్తిగత మరుగుదొడ్డి, ఇంకుడుగుంత తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, మండల సలహాదారుడు పైడి విఠలరావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షులు బి.లక్ష్మణరావు, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

టిడిపిలో జనసేన విలీనం తప్పదు

పవన్ కళ్యాణ్ దత్తపుత్రుడు అని రుజువైందన్నారు. త్వరలో టిడిపిలో జనసేన విలీనమైనా ఆశ్చర్యపోనవసరం లేదని చెప్పారు. జనసేన రాజకీయ పార్టీయే కాదని, టిడిపి అనుబంధ విభాగమన్నారు. చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉంటే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ప్యాకేజీ ఎలా వస్తుందనే ఆలోచనలో ఉన్నట్లున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు వంటి ఆర్థిక ఉగ్రవాది దేశానికే ప్రమాదమని అభిప్రాయపడ్డారు. పవన్ కళ్యాణ్ జనసేన కార్యకర్తల నమ్మకాన్ని బలి చేశారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీ శంకర్, బెల్లాల శ్రీనివాసరావు, విప్ దుర్గాశంకర్ పండా, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, మున్సిపల్ డిఇ బి.హరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

ప్రజాశక్తి వజ్రపుకొత్తూరు

హిందీ భాష జాతీయ సమైక్యతకు చిహ్నం అని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.హరిబాబు అన్నారు. హిందీ భాష దినోత్సవ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందీ సబ్జెక్టు హిందీ భాషను నేర్చుకొనే విధంగా అధ్యయనం చేయాలన్నారు. ముందుగా భరతమాత, కబీర్ దాస్, ప్రేమ్‌చంద్, తులసీ దాస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శన, కిట్స్ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హిందీ ఉపాధ్యాయులు హక్ ఆలీ బేగ్ ఉపాధ్యాయులు జి.లక్ష్మణరావు, చింత ఉమారావు, డిల్లేశ్వరరావు, సీతమ్మ, సత్యరాజు, ఉమామహేశ్వరీ, ధర్మారావు, పార్థసారధి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలో చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికార భాష కోసం కృషి చేసిన రాజేంద్రసింగ్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. హిందీ వ్యాసరచన, డిబెట్, పద్యాలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు తమ్మినేని వైకుంఠరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల హిందీ దినోత్సవ వేడుకలో భాగంగా హిందీ భాష ప్రాధాన్యత, సులువుగా నేర్చుకోవడంపై వంద ఛాయాచిత్రాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొర్ల వైకుంఠరావు, హిందీ ఉపాధ్యాయులు బి.చిన్నారావు, వి.విష్ణు ఆచారి పాల్గొన్నారు. అలాగే సత్యసాయి విద్యా విహార్ పాఠశాల, రామకృష్ణాపురం సత్యసాయి విద్య విహారలో హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హిందీ దివస్ ఆకారంలో విద్యార్థులు కూర్చుని ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, కోచ్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

టెక్కలి : విద్యావ్యవస్థలో అమలవుతున్న త్రిభాషా సూత్రాన్ని ఆలవర్చుకునే క్రమంలో బాషా ఔన్నత్యాన్ని ఆయా భాషా పండితులు చాటి చెప్పాలని విశ్రాంత సబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రాళ్లపేట ప్రాథమికోన్నత పాఠశాలలో హిందీ జాతీయ దినోత్సవంలో భాగంగా గురువారం పాఠశాల ఆవరణలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. హిందీ ఉపాధ్యాయులు పట్నాన చంద్రిక ఆధ్వర్యాన నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే హిందీ భాషని తెలుపుతూ సూచించే అక్షర ఆకారంలో విద్యార్థులు కూర్చున్నారు. అనంతరం నిర్వహించే పలు పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతు శివానంద, సర్పంచ్ దల్లి లోకేష్‌రెడ్డి, ఎంపిటిసి సుగ్గు అప్పలరెడ్డి, రాజ్యలక్ష్మి, కుప్పిలి నగేష్, మోహిణి, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : పిఎన్ కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన హిందీ దివస్ కార్యక్రమంలో విశ్రాంత డిఇఒ, హిందీ మంచ్ గౌరవ సలహాదారు బలివాడ మల్లేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపాల్ పి.శ్రీకాంత్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్ పూడి జనార్దనరావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మంగిపూడి శ్రీనివాసరావు, హిందీ ఉపాధ్యాయులు విజయభాస్కర్, సునీతారాణి, మనస్విత, రేష్మా, మాధవి పాల్గొన్నారు. అనంతరం హిందీ క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తదితరులు పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం.భానుప్రకాష్ ఆధ్వర్యాన హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భాషా సంబంధిత అంశాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.అరుణ్‌కుమార్, అలియమ్మ, గోపాలకృష్ణ, మల్లేశ్వరరావు, వెంకటరావు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి చెందిన విద్యార్థులు హిందీ దినోత్సవం సందర్భంగా హిందీ ఆ అక్షర ఆకారంలో చేసిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, ఉపాధ్యాయులు బాలక రామారావు, రంకిడి రామారావు, ఎన్.గోవిందరాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక జ్ఞాన భారతి, స్వర్ణభారతి, శాంతి నికేతన్ విద్యా సంస్థల్లో హిందీ దివస్ వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో జునాబ్ జోహార్ ఖాన్, చాట్ల తులసీదాస్‌రెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని బోరుభద్రలో హిందీ దివాస్‌లో భాగంగా విద్యార్థులు హిందీ అక్షర 'అ' ఆకృతిలో కూర్చున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, హిందీ ఉపాధ్యాయులు బి.ఉమాదేవి, బి.నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : హిందీ దివాస్ కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని చీపుర్లపాడు మండల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు తెలిపారు.

పొందూరు : మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య, హిందీ ఉపాధ్యాయులు పైడి అప్పలనాయుడు ఆధ్వర్యాన హిందీ దివస్ నిర్వహించారు.

టెక్కలి : హిందీ అక్షర ఆకారంలో కూర్చున్న రాళ్లపేట విద్యార్థులు

విచారణ చేస్తున్న అధికారులు

కలివరం ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి

ప్రజాశక్తి- ఆమదాలవలస

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కలివరం ఫీల్డ్ అసిస్టెంట్ ఆగస్తి నారాయణరావుపై ఓ పత్రికా విలేకరి గురువారం దాడి చేశారు. ఈ నెల 8న పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయం వద్ద డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు ఆధ్వర్యాన సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఆ రోజే ఓ పత్రికలో పని వివరాలు తెలిపే పలకాలు ఏర్పాటుకు ప్రభుత్వం రూ.7 వేలు మంజూరు చేసిందని, రూ.2 వేలే ఖర్చు చేశారని, మిగతావి ఫీల్డ్ అసిస్టెంట్లు కాజేశారని కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని డ్వామా పీడీ దృష్టికి ఫీల్డ్ అసిస్టెంట్లు తీసుకెళ్లారు. పనులను పరిశీలించి సక్రమంగా ఉంటే బిల్లులు మంజూరు చేస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లకు హామీనివ్వడంతో గొడవ అక్కడకు సద్దుమణిగింది. గురువారం బిల్లులు మంజూరు కాలేదని ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లారు. అదే సమయంలో అక్కడకు వెళ్లిన ముగ్గురు విలేకరులు ఫీల్డ్ అసిస్టెంట్లతో తగాదా పడ్డారు. ఇంతో కోపోద్రిక్తుడైన ఓ విలేకరి కలివరం ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరావు చెంప చెల్లుమనిపించారు. దీంతో గందరగోళం నెలకొనడంతో వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్లు చరవాణిలో ఎస్ఐ కృష్ణకు ఫోన్‌లో సమాచారం అందించారు. వెంటనే ఎస్ఐ ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకుని ఇరువురిని మందలించి కానిస్టేబుల్‌ను అక్కడ పెట్టి వెళ్లిపోయారు. ఫీల్డ్ అసిస్టెంట్లు అందరూ సమావేశమై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దాడి చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. ఎస్ఐను సంప్రదించగా... ఇరువైపుల నుంచి ఫిర్యాదులు అందాయని, పరిశీలిస్తున్నామని తెలిపారు.

బాతుపురం రోడ్డుపై ఎలుగు

రోడ్డుపై సంచరిస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు : ఉద్దానం ప్రాంతంలో ఎలుగు భయం వీడడం లేదు. ఇప్పటికీ ఉద్దానం జీడి తోటలు ప్రాంతాల్లో సంచరిస్తూ కనిపిస్తూనే ఉంది. గురువారం మధ్యాహ్నం చినవంక-బాతుపురం మధ్యలో రోడ్డుపై సంచరిస్తూ కనిపించింది. ఒకవైపు జీడి తోటలు నుంచి, మరో వైపు తోటలకు వెళ్తూ స్థానిక యువకుల దృష్టిలో పడింది. యువకులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. కొంతమంది యువకులు సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఉద్దానం ప్రాంతంలో ఎలుగు సంచారంపై అటవీశాఖ అధికారులు దృష్టి సారించి ఎలుగు దాడులు జరగకుండా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అగ్రిగోల్డ్ ఏజెంట్లకు నోటీసులు

టెక్కలి రూరల్ : టెక్కలిలోని పలువురు అగ్రిగోల్డ్ ఏజెంట్లకు గురువారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. విజయవాడలో శుక్రవారం జరగనున్న అగ్రిగోల్డ్ గర్జన సభకు హాజరయ్యేందుకు చలో విజయవాడ కార్యక్రమానికి సమయత్తయ్యారు. దీంతో ప్రభుత్వం స్పందించి చలో విజయవాడను భగ్నం చేసే నేపథ్యంలో పోలీసులు నోటీసులు జారీ చేశారు. నిరసన కార్యక్రమాలకు వెళ్తే శాంతిభద్రతల సమస్య నెలకొనే అవకాశం ఉన్నందున కార్యక్రమానికి హాజరు కావొద్దని నోటీసుల్లో పేర్కొన్నారు.

భవన నిర్మాణ పనులు వేగవంతం

ఇచ్ఛాపురం : మండలంలోని ముచ్చింద్రలో నిర్మిస్తున్న ఎస్‌సి కమ్యూనిటీ భవనం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపిపి ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ సూచించారు. ఈ మేరకు భవన నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం మంజూరైన భూ హక్కు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ గురుప్రసాద్, వైసిపి నాయకులు కె.మోహనరావు, ఆసి కృష్ణారావు, చిట్టిబాబు, విఆర్ఒ ఉప్పాడ రాజారెడ్డి, నూకయ్య రెడ్డి, కొగయ్య పాల్గొన్నారు.

నేడు న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి : అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వ పరంగా వారికి అందించే వివిధ సంక్షేమ పథకాలు, వాటి వినియోగంపై శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు టెక్కలిలో నిర్వహిస్తున్నామని సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో మధ్యాహ్నం రెండున్నర గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు అసంఘటిత కార్మికులు వినియోగించుకోవాలని కోరారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్ : పర్యావరణ హితమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మట్టి గణపతి విగ్రహాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. వినాయక చవితిని పురస్కరించుకుని రాగోలులోని దూసి రోడ్డులో గురువారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ ఆధ్వర్యాన గురువారం మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, సెక్రటరీ టి.రామ్‌గోపాల్, ఎల్‌సిఐ ఎఫ్ కో-ఆర్డినేటర్, సీపాన రమేష్‌కుమార్, కామేష్, జగదీష్ పాల్గొన్నారు.

తెనాలీ డబుల్ హార్స్ మినపగుళ్ల కంపెనీ ప్రతినిధులు రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు మట్టి వినాయకుడిని అందజేశారు.

వసతిగృహం సందర్శన

మెళియాపుట్టి : విద్యార్థులకు పెట్టే మెనూ సక్రమంగా అమలు చేయాలని తహశీల్దార్ పి.సరోజిని అన్నారు. మండలంలోని భరణికోట ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థుల భోజనాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వంట నాణ్యత లేదని, సక్రమంగా వండి పెట్టాలని ఆదేశించారు. అనంతరం భావనాపురంలో కొత్తగా ఏర్పాటైన పోలింగ్ బూత్‌ను పరిశీలించారు. ఆర్ఐ వైకుంఠరావు, హెచ్‌ఎం డి.దాలినాయుడు, వార్డెన్ గాయత్రిదాస్, ప్రియాంక, ప్రశాంతి, లక్ష్మీకాంతం సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పదమైన షెడ్‌లో ఉన్న వృద్ధులు

వివాదాస్పద భూమిపై రగడ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని టెక్కలిపట్నం కాలనీలో వివాదాస్పద భూమిపై రగడ జరుగుతోంది. రెండు రోజులుగా కాలనీ వాసులు, తమ ఆధీనంలో ఉన్న వ్యక్తులు గొడవ పడ్డారు. గురువారం అది చినుకు చినుకు గాలి వానలా మారి పరస్పర వాదనలకు దిగే స్థాయికి చేరుకుంది. మండలంలోని టెక్కలిపట్నం కాలనీ సర్వే నంబరు 34లో 6.85 ఎకరాలు సోషల్ వెల్ఫేర్ స్థలం ఉండేది. సుమారు 25 నివాస గృహాలకు గతంలో అధికారులు పట్టాలు ఇచ్చారు. ఉన్న స్థలాన్ని కొంత మంది వ్యక్తులు ఆక్రమించుకుని నివాసగృహాలు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం కాలనీలో సుమారు 56 కుటుంబాలు ఇళ్లు నిర్మాణాలు చేపట్టి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత తరుణంలో కాలనీ మధ్యలో బావి, ఆ పక్కన సుమారు అర సెంటుకు పైగా ఉన్న స్థలంపై కాలనీ వాసులు, అదే ప్రాంతానికి చెందిన వృద్ధులు బొమ్మాళి రామయ్య, మహాలక్ష్మిలు తమదంటే తమదని గొడవ పడుతున్నారు. ఆ స్థలంలో కాలనీ వాసులు వినాయక ఆలయ నిర్మాణం చేపడతామని చెబుతుండగా... చాలా రోజుల నుంచి ఆ స్థలం మా ఆధీనంలో ఉందని, ఆ స్థలంలో నివాసం ఉండేందుకు చిన్న రేకుల షెడ్ నిర్మాణం చేపడితే తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీంతో ఇరు గ్రూపుల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ విషయంపై స్థానిక విఆర్ఒ సోమేశ్వరరావుకు వివరణ కోరగా, బావి పక్కన ఉన్న స్థలం ప్రభుత్వ స్థలమని, అది ఎవరికి హక్కు లేదని చెప్పారు. ఆ స్థలాన్ని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలి

ఇచ్ఛాపురం: మండలంలోని పెద్దలక్ష్మీపురంలో రొయ్యల చెరువుల వల్ల సర్వం నష్టపోతున్న వ్యవసాయ సాగు రైతులందరికీ వారం రోజుల్లో సమస్య పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు డిమాండ్ చేశారు. గురువారం బాధిత రైతులతో కలిసి శాంతియుతంగా ధర్నా చేపట్టారు. ప్రధాన కాలువకు ఆనుకుని రొయ్యల చెరువుల యాజమాన్యాలు సాగు చేస్తున్నారని అన్నారు. ఈ కాలువ ఉప్పు నీరు రావడంతో సాగునీటికి ఆటంకం కలుగుతుందని రైతులు వాపోయారు. అలాగే రొయ్యిల చెరువులను శుభ్రపరిచే క్రమంలో వివిధ రసాయనాలతో కూడిన బురద, మట్టి ప్రధాన కాలువ వస్తుందని వివరించారు. దీంతో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రోకళ్ల భాస్కర్, నాయుడు, రామారావు, ఇంద్రమ్మ, శకుంతల, పుణ్యవతి, కృష్ణమ్మ పాల్గొన్నారు.

బాధిత రైతులతో మాట్లాడుతున్న రాజు

ప్రజాశక్తి

నవ భారత నిర్మాత మోక్షగుండం

నేడు ఇంజినీర్స్ డే

భారతీయ ఇంజినీర్లందరికీ సెప్టెంబర్ 15 ఓ పండగ రోజు. ప్రఖ్యాత ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి ఈ రోజే. ఈ భారతమాత ముద్దుబిడ్డ స్మారకార్థం ప్రతి ఏడాది ఆయన జయంతిని ఇంజినీర్స్ డేగా నిర్వహించుకుంటున్నాం. జాతికి ఆయన చేసిన చిరస్మరణీయ సేవలను మననం చేసుకోవడం ఈ తరం ఇంజినీర్లకు, ఇంజినీరింగ్ వృత్తిలో ప్రవేశిస్తున్న లక్షలాది యువతకు ఎంతో స్ఫూర్తిదాయకం. మౌలిక వసతుల కల్పనకు ఇంజినీరింగ్ రంగం ఎంత ప్రధానమైనదో జీవితాంతం కార్యశీలురుగా నిరూపించిన మహామనిషి ఆయన. నైతిక విలువల ఆధారంగా పనిచేసి ఇంజినీరింగ్ రంగానికి విశిష్ట గుర్తింపు, గౌరవం సంపాదించి పెట్టారు.



ప్రజాశక్తి- శ్రీకాకుళం

విశ్వేశ్వరయ్య పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా గిద్దలూరు సమీపంలోని మోక్షగుండం అనే గ్రామంలో ఉండేవారు. 17వ శతాబ్దంలో విశ్వేశ్వరయ్య తాతగారు కుటుంబంతో సహా నాటి మైసూరు సంస్థానంలోని కోలారు జిల్లా చిక్‌బళ్లాపూరు పట్టణంలో స్థిరపడ్డారు. ఆ కుటుంబీకులు ఆ ప్రాంత పరిపాలకుల వద్ద అనేక పదవులు నిర్వహించి ప్రసిద్ధికెక్కారు. వారిలో లక్ష్మీపతిభట్టు అనే ఆయన మంత్రిగా పని చేశారు. ఆయన సేవలకు ప్రతిఫలంగా నాలుగైదు గ్రామాలు ప్రతిఫలంగా లభించాయి. వీటిల్లో ఒకటి ముద్దుపల్లి. ఇదే తరువాత 'ముద్దేనహళ్లి' అయింది. ఈ గ్రామంలో 1861 సెప్టెంబరు 15న శ్రీనివాసశాస్త్రి, వెంకటలక్ష్మమ్మ దంపతులకు విశ్వేశ్వరయ్య జన్మించారు.

విద్యాభ్యాసం

విశ్వేశ్వరయ్య 15 ఏళ్ల వయసులో ఆయన తండ్రి మృతి చెందారు. ఆ సమయంలో చిక్‌బళ్లాపూర్‌లో ఎనిమిదో తరగతి ఉత్తీర్ణుడైన విశ్వేశ్వరయ్య పైచదువులు సాగించడానికి ఇబ్బంది ఏర్పడింది. బెంగుళూరులో ఉన్న ఆయన మేనమామ రామయ్య తన వద్దకు రప్పించుకుని 1875లో వెస్లియన్ మిషన్ హైస్కూలులో చేర్పించాడు. మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు విశ్వేశ్వరయ్య. సెంట్రల్ కాలేజిలో 1881లో బిఎ పట్టా పొందారు. ఆ రోజుల్లో ఇంజనీరింగ్‌లో ఉన్నత శిక్షణకు బెంగుళూరులో వీలుండేది కాదు. మైసూరు సంస్థానం దివాన్‌గా ఉన్న రంగాచార్యులు విశ్వేశ్వరయ్యకు విద్యార్థి వేతనం మంజూరు చేశారు. పూనా ఇంజినీరింగ్ కళాశాల నుంచి 1883 నవంబర్‌లో ఆయన ఎల్‌సిఇ, ఇసిఎల్ పరీక్షల్లో బొంబాయి రాష్ట్రం మొత్తమ్మీదే ప్రథముడిగా ఉత్తీర్ణులయ్యారు. అత్యుత్తమ విద్యార్థిగా నిలిచిన ఆయన 'బర్కిలే' బంగారు పతకం అందుకున్నారు.

ఇంజినీరుగా ప్రస్థానం

ఇంజినీరింగ్ పరీక్షల్లో బొంబాయి రాష్ట్రంలోనే ప్రథముడిగా నిలవడం ఆయన జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి బొంబాయి ప్రభుత్వంలో ఉద్యోగం ఇవ్వడం ఆనాటి ఆనవాయితీ. దీని ప్రకారం 1884 మార్చిలో విశ్వేశ్వరయ్య బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్‌వర్క్స్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీరుగా నియమితులయ్యారు. పంజ్రా నదీ జలాలను దతారి గ్రామానికి 'సైఫన్' పద్ధతి ద్వారా సరఫరా చేసే బాధ్యతను బొంబాయి ప్రభుత్వం విశ్వేశ్వరయ్యకు అప్పగించింది. ఆ ప్రాంతం కొండలమయం. పైగా, విపరీతమైన వర్షాలు కురుస్తున్నాయి. అయినప్పటికీ, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆ పనిని విజయవంతంగా ఆయన పూర్తి చేశారు. ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. ఆ సమయంలోనే మలేరియా వ్యాధి బారిన పడటంతో తనను బదిలీ చేయాల్సిందిగా కోరారు. దీంతో, ఆయనను పూనాలో రహదార్లు, భవనాల విభాగానికి బదిలీ చేశారు.

సింధు నదీ జలాలను సుక్కూరు పట్టణానికి సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం బ్రిటిష్ ఇంజినీరును నియమించినా, ఆయన ముందుకు రాలేదు. దీంతో, ప్రభుత్వం ఈ పనిని విశ్వేశ్వరయ్యకు అప్పగించింది. సింధునదిలో ఒండ్రు ఎక్కువ. దీంతో, మంచినీటి సరఫరా కష్టసాధ్యమైంది. దీన్ని అధిగమించేందుకుగానూ విశ్వేశ్వరయ్య నదీతీరంలో పెద్ద బావులు తవ్వించారు. నదీ జలాలు ఇసుక పొరల్లోంచి బావుల్లోకి చేరే ఏర్పాటు చేశారు. దీంతో నీరు శుభ్రపడింది. ఈ నీటిని పంపుల ద్వారా లిఫ్టు చేసి పైన ఉన్న జలాశయంలో నింపేవారు. అక్కడి నుంచి గొట్టాల ద్వారా సుక్కూరు పట్టణానికి నీటి సరఫరా జరిగింది.

విదేశాల్లో సైతం సేవలు

1904లో విశ్వేశ్వరయ్య బొంబాయి రాష్ట్ర శానిటరీ ఇంజినీరుగా నియమితులయ్యారు. ఆ కాలంలో మన దేశం నుంచి ఇంగ్లాండ్‌కు సూయిజ్ కాలువ ద్వారా నౌకలు వెళ్లేవి. ఈ కాలువ ప్రవేశ ద్వారం వద్ద ఏడెన్ రేవు పట్టణం ఉండేది. ఈ పట్టణం పాలనా బాధ్యతలు బొంబాయి రాష్ట్రంపై ఉండేవి. ఏడెన్ పట్టణంలో నీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఆ రోజుల్లో సముద్ర జలాలను ఆవిరిగా మార్చి, వాటిని గొట్టాల ద్వారా పట్టణానికి చేరవేసి తరువాత దాన్ని నీరుగా మార్చుకునేవారు. దీనివల్ల ఎంతో వ్యయం అయ్యేది. ఈ సమస్యను పరిష్కరించే పనిని బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం విశ్వేశ్వరయ్యకు అప్పగించింది. పట్టణానికి 18 మైళ్ల దూరంలోని లహేజ్ వద్ద బావులు తవ్వి, చుట్టుపక్కల కొండల నుంచి వచ్చే వర్షపు నీటిని అందులో నిల్వ చేసి, అక్కడ్నుంచి ఆ నీటిని ఏడెన్ పట్టణానికి తరలించేలా విశ్వేశ్వరయ్య పథకం రూపొందించడంతో నీటి సమస్య తీరింది. ఏడెన్ పట్టణంలో ప్రజారోగ్యం కోసం భూగర్భ మురుగు కాలువలు నిర్మించి అక్కడి ప్రజల మన్ననలు అందుకున్నారు విశ్వేశ్వరయ్య. ఆయన కృషిని ప్రశంసిస్తూ ప్రభుత్వం 'కెయిజర్-ఇ-హింద్' స్వర్ణ పతకంతో సత్కరించింది.

ఉద్యోగానికి రాజీనామా

భారతీయులను బ్రిటిష్ అధికారులు చిన్నచూపు చూడటాన్ని విశ్వేశ్వరయ్య సహించలేక పోయేవారు. అన్నివిధాలా తాను చీఫ్ ఇంజినీర్ పదవికి అర్హుడినైనా, ఆ పోస్టును బ్రిటిష్ వారికే కేటాయించడాన్ని నిరసిస్తూ తన ఉద్యోగానికి 1908లో రాజీనామా చేశారు. ఆయన రాజీనామా లేఖను చూసిన గవర్నర్ సిడెన్‌హాం ఆశ్చర్యపోయారు. విశ్వేశ్వరయ్యకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అప్పటికి ఆయన ఉద్యోగంలో చేరి 23 ఏళ్లు అయింది. మరో రెండేళ్లు పనిచేస్తే పింఛను లభించేది. అయినా భారతీయుల ప్రతిభను గుర్తించనప్పుడు పదవి ఎందుకని ప్రశ్నిస్తూ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. గవర్నర్ ఆయనకు పూర్తి పింఛను మంజూరు చేస్తూ, రాజీనామానూ అంగీకరించారు.

దేశవ్యాప్తంగా సేవలు

1937లో ఒడిశాలోని మహానది వరదల వల్ల అపారమైన నష్టం వాటిల్లింది. వరదల నిరోధానికి తగు సూచనలివ్వాల్సిందిగా విశ్వేశ్వరయ్యను గాంధీజీ కోరారు. అప్పటికి విశ్వేశ్వరయ్య వయసు 76 ఏళ్లు. వయసు మీద పడుతున్నా మహానదీ పరీవాహక ప్రాంతాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, సముచిత పథకాన్ని సూచించారు. ఒడిశా ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు చేసింది. ఒడిశా ప్రభుత్వం తనకు పంపిన గౌరవ ధనాన్ని ఆయన తిప్పి పంపుతూ, గాంధీజీ ఆదేశం మేరకే తాను సేవలు అందించానని పేర్కొన్నారు. 1939లో బెంగుళూరులో విమాన కర్మాగార పథకం రూపకల్పనలోనూ ఆయన తన సేవలందించారు. విశాఖపట్నంలోని హిందూస్థాన్ షిప్‌యార్డ్ నిర్మాణంలో ఎదురైన అవరోధాన్ని అధిగమించేందుకు ఆయన చక్కని సూచన చేశారు. గంగా నదిపై వంతెన నిర్మించాలని రైల్వే బోర్డు నిర్ణయించగా, ఈ వంతెనను ఎక్కడ నిర్మించాలనే విషయమై భిన్నాభిప్రాయాలు తలెత్తాయి. దీన్ని పరిశీలించి సరైన సూచన ఇవ్వాల్సిందిగా విశ్వేశ్వరయ్యను నాటి ప్రధాని నెహ్రూ కోరారు. అప్పటికి 90 ఏళ్లు దాటినా, విశ్వేశ్వరయ్య తన సమ్మతి తెలిపారు. అనంతరం బి.సి బైజాల్, బి.బి.వర్మ, వి.పి.భండారీ, పి.బి అద్వానీలను తనకు సహాయకులుగా నియమించాల్సిందిగా కోరారు. ఈ సమితి కార్యదర్శిగా బైజాల్‌ను నియమించారు. ఈ సమితి కార్యక్రమాలకు, పర్యవేక్షణకు ఒక రైలుబండిని, నదిపై ఎత్తు నుంచి పరిశీలించడానికి ఒక విమానం ఏర్పాటు చేశారు. ఈ సమితి పాట్నా, కలకత్తా, ఖాట్మండ్ తదితర ప్రాంతాలకు వెళ్లి అనేకమంది అభిప్రాయాలు సేకరించింది. మొఖామే వద్ద వంతెన నిర్మించాల్సిందిగా సూచించారు. ఈ వంతెన నిర్మాణం 1953లో ప్రారంభమై, ఆరేళ్లలో పూర్తయింది.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గస్తీ వ్యవస్థను పటిష్టపరిచి, ఆస్తి నేరాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో పోలీసు అధికారులతో ఆగస్టులో నమోదైన కేసులపై నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాపర్టీ నేరాల్లో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. దొంగతనాలు చేసే వారు లాడ్జిల్లో బస చేస్తారని, రాత్రివేళల్లో లాడ్జీలను ఆకస్మిక తనిఖీ చేసి సిసి కెమెరాలు పర్యవేక్షించాలని సూచించారు. పగటిపూట, రాత్రివేళ గస్తీలను పటిష్టంగా అమలు చేయాలని, వాహనాల తనిఖీలు నిర్వహించి అనుమానిత వ్యక్తులపై దృష్టిసారించాలన్నారు. ఎస్ఐ స్థాయి అధికారి స్వయంగా గస్తీలు నిర్వహిస్తూ నేరాలు జరగకుండా చూడాలని, డిఎస్‌పి, సిఐలు వారి పరిధిలో గస్తీలను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎక్కువగా నేరాలు జరుగుతున్న పోలీస్ స్టేషన్ల పరిధిలో గస్తీలను పెంచాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసుల్లో నిర్ణీత సమయంలో దర్యాప్తు ముగించి ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. పోక్సో కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని చెప్పారు. దర్యాప్తు పూర్తయిన ప్రతి కేసు ఛార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం సిసిటిఎన్‌లో నమోదు చేయాలన్నారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, పాత నిందితులపై దృష్టిసారించాలన్నారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేసి త్వరగా ఆచూకీ తెలుసుకోవాలన్నారు. గ్రేవ్ కేసుల్లో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే ప్రదేశాలను, మహిళలపై అఘాయిత్యాలు జరిగేందుకు అవకాశమున్న ప్రదేశాలను గుర్తించి నిరంతరం తనిఖీలు చేయాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. 'స్పందన' ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పిలు టి.పవి విఠలేశ్వర్, జె.తిప్పేస్వామి, డిఎస్‌పిలు ఎస్.బాలరాజు, వై.శృతి, డి.బాలచంద్రారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఎస్.వాసుదేవ్, డి.విజయ కుమార్, సిఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అక్టోబర్ ఐదో తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, నగర కన్వీనర్ శ్రీదేవి పాణిగ్రహి పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో చలో ఢిల్లీ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాద పాలకులు అధికారంలోకి వచ్చినప్పట్నుంచీ మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మణిపూర్ వంటి ఘోరకృత్యాలు దేశంలో చోటుచేసుకుంటున్నా కేంద్ర పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. వీటితోపాటు విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాలు, పెట్రో ధరలు విపరీతంగా పెరుగుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజలపై ధరాభారం మోపి అంబానీ, అదానీలకు సబ్సిడీల పేరిట ప్రజా ధనాన్ని వెచ్చిస్తూ సేవ చేయడంలోనే మోడీ తరిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దశల వారీ మద్య నియంత్రణ అని మాయమాటలు చెప్పి, మరింత ఎక్కువ అమ్మకాలు చేపడుతుందే తప్ప మద్యాన్ని నియంత్రించే దిశగా అడుగులు వేయడం లేదని విమర్శించారు. వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రానున్న ఎన్నికల నేపథ్య దష్ట్యా ప్రజలందరికీ మేలు చేకూర్చే దిశగా ప్రణాళికను రూపొందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు డి.భానుమతి, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు ఎం.లలిత, బి.సుగుణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా నాయకులు

జగన్ పాలనలో

అవినీతికి చోటు లేదు

ఇచ్ఛాపురం: సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఎలాంటి అవినీతి లేకుండా ప్రజలకు మంచి పాలన అందిస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని బెల్లుపడాలో గురువారం విలేకరులతో మాట్లాడారు. నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) సంస్థలో మాజీ సిఎం చంద్రబాబునాయుడు అవినీతి పాల్పడినట్లు సిఐడి నిరూపించే అరెస్టు చేశారని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్ నీలాపు లక్ష్మి, కౌన్సిలర్ ప్రాతినిధులు పిలక విజయభాస్కర్, నీలాపు ఢిల్లీ పాల్గొన్నారు.

నాణ్యత, నమ్మకం హారిక కన్‌స్ట్రక్షన్స్ సొంతం

హారిక కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టెంట్స్ అధినేత హారికాప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కన్స్ట్రక్షన్ రంగంలో నిజాయితీకి నిలువెత్తు రూపం హారిక కనస్ట్రక్షన్ అండ్ కన్సల్టెంట్స్ అని అధినేత హారికాప్రసాద్ తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్యను స్మరించుకుంటూ... ఇంజినీర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యతలో రాజీ పడకుండా నిర్మాణాలు చేపట్టి నిర్మాణదారుడుకి నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ విజయం రహస్యమని అన్నారు. అభిరుచినెరిగి అధునాతన పద్ధతుల్లో నిర్మాణాలు చేపట్టడంలో మా సంస్థకు మంచి పేరు ఉందని అన్నారు. ఎంతో ఒత్తిడితో కూడుకున్న ఈ సివిల్ రంగంలో రాణించాలంటే చేసే పనిలో నిజాయితీ ఉండాలని అన్నారు. వినియోగదారుడు తనకు నిర్మాణం అప్పగిస్తే తన ఇల్లు లానే భావించి కడతామని అన్నారు. వందేళ్లపాటు చెక్కుచెదరని నిర్మాణం ఇవ్వడమే తమ లక్ష్మమని చెప్పారు. నాణ్యమైన మెటీరియల్, క్వాలిటీ అందించడం వల్లే నిర్మాణ రంగంలో తాను ఉన్నత స్థాయికి చేరుకో గలిగానని ధీమా వ్యక్తం చేస్తున్నారు, స్వాయిల్ టెస్ట్ చేసి డిజైన్ ఇచ్చినప్పుడే మనపై మనకు నమ్మకం కలుగుతుందని స్పష్టం చేశారు. లేకుంటే మేస్త్రీలకు, ఇంజినీర్లకు పెద్ద తేడా ఉండదని చెప్పారు. నా జీవిత భాగస్వామి శోభారాణి సేవల్లో సహకారం మరువలేనిదని తెలిపారు. మాకు హారిక, మౌనీష్ పిల్లలు ఉన్నారని అన్నారు. ప్రస్తుతం కుమార్తె డెంటిస్ట్, కాస్మోటాలజిస్టుగా సేవలందిస్తూ... సివిల్స్‌కు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. మౌనీస్ ఎంబిబిఎస్ పూర్తి చేసి, కళింగ యూనివర్శిటీలో పిజి జనరల్ మెడిసిన్ చదువుతుందని అన్నారు. కె.ఎన్.ఎస్.వి .ప్రసాద్ రెండు దశాబ్దాల కిందట ప్రారంభించిన హారిక కన్స్ట్రక్షన్స్, కన్సల్టెంట్స్ సంస్థ అధినేత అంచలంచెలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని అన్నారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్‌గా తండ్రి కరణం మోహనరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసిన చిన్నాన్న కరణం అప్పారావులను చూసి తాను ఇంజినీర్ కావాలని చదివానని అన్నారు. ఇంజినీరింగ్ చదివి పలు కంపెనీలకు సేవలు అందించానని తెలిపారు. ఆ సమయంలో నిర్మాణ రంగంలో నాణ్యత ప్రాధాన్యతను గుర్తించి, తాను చేపట్టే పనులలో ఆర్థికంగా వ్యయం పెరిగిన నాణ్యతకే పెద్దపేట వేశానని తెలిపారు. సొంతంగా హారిక కన్స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టెంట్స్ ప్రారంభించిన తర్వాత కూడా అదే విధానానికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. శ్రీకాకుళం కేంద్రంగా ప్రధాన కార్యాలయం విశాఖలో బ్రాంచ్‌ని ఏర్పాటు చేసి, ఈ రెండు కేంద్రాల్లో 25 మంది సిబ్బంది ఉపాధి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్నామని అన్నారు. శ్రీకాకుళం జిల్లా లైసెన్స్ అండ్ కన్సల్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులుగా వరుసగా ఐదో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యానని తెలిపారు. పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం చేయడం వారికి పుస్తకాలు, యూనిఫారాలు అందజేస్తుంటారని చెప్పారు. కరోనా సమయంలో పేదలకు ఆహార కిట్లను పంపిణీ చేశామని అన్నారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రెసిడెంట్‌గా ఉత్తమ సేవలు అందించినందుకు గవర్నర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు తీసుకున్నట్టు తెలిపారు.

నిర్మాణ రంగంలో నూతన ఒరవడి

క్రియేటివ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీనివాసరావు

శ్రీకాకుళం : నిర్మాణ రంగంలో నూతన ఒరవడలు సృష్టించి నేటి ఇంజినీర్లకు మార్గదర్శి, భావితర ఇంజినీర్లకు దిక్సూచి అయిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే నిర్వహించుకోవడం ఇంజినీర్లందరికీ గర్వకారణమని క్రియేటివ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, సివిల్ ఇంజినీర్ ముని శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఇంజినీరలందరికీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజిజనీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాణరంగంలో 30 ఏళ్ళ సివిల్ ఇంజినీరింగ్ రంగంలో సమాజంలో మంచి గుర్తింపు వచ్చిందని అన్నారు. ప్రతి మనిషికీ ప్రాథమిక అవసరాల్లో ఒకటి గూడు. మా సంస్థ ద్వారా బిల్డింగ్ ప్లాన్లు, డిజైన్స్ వాల్యుయేషన్ వంటి సేవలు సంస్థ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అన్ని రకాల కమర్షియల్, రెసిడెన్షియల్, ఇండస్ట్రియల్, అపార్ట్‌మెంట్లు, ఆలయాల నిర్మాణాలకు మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాన్స్ అప్రూవల్ చేయిస్తున్నామని తెలిపారు.

గుర్తింపు తెచ్చే సేవలు

విశాఖపట్నం అచ్యుతాపురంలో ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్స్ నేషనల్ లెవెల్‌లో నిర్మించే చైనా కంపెనీ నిర్మాణానికి రూ.200 కోట్లతో ప్రాజెక్టుకు సివిల్ ఇంజినీర్‌గా సేవలు అందించడం ఎంతో గర్విస్తున్నానని అన్నారు. శ్రీకాకుళం జిల్లా సత్యసాయి సంస్థలకు ఇంజినీర్‌గా పలు ఆలయాలు, అన్నదాన శిబిరాలు, యూత్ సర్వీస్ సెంటర్లు, వుమన్ ఎంపవర్మెంట్ సర్వీస్ సెంటర్ల నిర్మాణానికి ఉచితంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. 2005, 2006లో నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో 120 పైగా బావులు తవ్వించామని అన్నారు. పిఎన్ కాలనీలో వెంకటేశ్వరస్వామి, ఫరీదుపేటలో రాతితో నిర్మిస్తున్న రంగనాథ స్వామి, శాంతినగర్ కాలనీలో గాంధీ స్మారక మందిరం నిర్మాణాలకు క్రియేటివ్ కన్స్ట్రక్షన్ అధినేత సివిల్ ఇంజినీర్ ముని శ్రీనివాసరావు అందించిన డిజైన్ చూపిన ప్రతిభ అమోఘమనే రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అభినందిస్తూ... ప్రశంసాప త్రాలను అందజేశారని గుర్తు చేశారు. ఇంజినీర్స్ అసోసియేషన్ తరపున 2013లో సమైక్యాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహించి ముందుకు నడిపించామని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ఎచ్చెర్లకి రాజీవ్ విద్యా మిషన్ కి ఇంజినీర్‌గా సేవలందించామని అన్నారు. ప్రస్తుతం రోటరీ క్లబ్ మెంబరుగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నా మని, స్టేట్ ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా, క్రీడారంగంలో ఎన్నో సేవలు అందిస్తున్నామని తెలిపారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఈకామ్ వెల్ స్వచ్ఛంద సంస్థ, కుష్టు రోగులకు ఉచిత వైద్యం, పిల్లలకు ఉచిత వసతి, భోజనం వంటి సేవలు అందిస్తున్నామని చెప్పారు. మా సంస్థ విజయవంతం కావడానికి ఇల్లు కట్టుకునే వారి కష్టనష్టాలను దృష్టిలో పెట్టుకొని కస్టమర్‌కు ఇంటి ప్లాన్ అప్రూవల్ దగ్గర్నుండి నిర్మాణం పూర్తయ్యేంత వరకూ సహాయ సహకారాలు అందించడమే మా ధ్యేయమని అన్నారు.

విశ్వేశ్వరయ్య గొప్ప దేశభక్తుడు

భారతరత్నం మోక్షగుండం విశ్వేశ్వరయ్య గొప్ప దేశభక్తుడని, ఈ దేశానికి ఎనలేని సేవలు చేశారని ఆయన జీవితం భావితరాల ఇంజినీర్లకు ఆదర్శప్రాయమని పంచాయతీరాజ్ ఇంజినీర్ల జెఎసి చైర్మన్ సనపాల రామకృష్ణ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఆనాడు ఇప్పుడున్న సదుపాయాలు లేవని, కేవలం లాంతర్ల వెలుగులో పనిచేయాల్సి వచ్చేదని అన్నారు. వాహనాలు లేకపోయినా కాలినడకన వెళ్లి పనులు చేసేవారని అన్నారు. అదే స్ఫూర్తిని తీసుకొని నేటి ఇంజినీర్లు మెలగాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో ఈ ఆధునిక సదుపాయాలను ఉపయోగించుకొని విశ్వేశ్వరయ్య ఆదర్శవంతమైన జీవితాన్ని ఆయన నిజాయితీని, నిబద్ధతను పనివిధానాన్ని అలవర్చుకొని ఆచరించడం మన ముందున్న కర్తవ్యం, అదే ఆయనకు ఇవ్వగలిగే గొప్ప నివాళి అని అన్నారు.

- సనపల రామకృష్ణ,
పంచాయతీరాజ్ ఇంజినీర్లు జెఎసి చైర్మన్

విశ్వేశ్వరయ్య స్ఫూర్తి

ప్రపంచ ఇంజనీర్లకు స్ఫూర్తి నింపిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో నేటి ఇంజినీర్లు సేవాభావంతో సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పంచాయతీరాజ్ జెఎసి ప్రధాన కార్యదర్శి మహంతి తెలిపారు. ఇంజినీర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఇంజినీర్లకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తి అని అన్నారు. అదే స్ఫూర్తితో ప్రపంచ ఇంజినీర్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆయన సివిల్ ఇంజినీర్ అయినప్పటికీ రైల్వే బ్రిడ్జిలు, సర్దార్ కాటన్ వంటి బ్రిడ్జిలు నేటికీ వందేళ్లయినా చెక్కు చెదరకుండా ఉన్నాయంటే అది ఆయన గొప్పదనమన్నారు. ప్రస్తుతం సాంకేతికంగా అభివృద్ధి చెందిన పరిస్థితుల్లో ఇంజినీర్లు మరింత వండర్స్ సృష్టించాలని అన్నారు. రానున్న కాలంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

- కె.సిహెచ్.మహంతి,
పంచాయతీరాజ్ ఇంజినీర్
జెఎసి ప్రధాన కార్యదర్శి



23న 5కె రన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మీనాక్షి, డిఎంహెచ్‌ఒ

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించడానికి వీలుగా జిల్లా కేంద్రంలో యూత్ ఫెస్ట్ 5కె రెడ్‌రన్ మారథాన్ నిర్వహిస్తున్నట్లు డిఎంహెచ్‌ఒ డాక్టర్ మీనాక్షి తెలిపారు. ఈ మేరకు ఆమె కార్యాలయంలో యూత్ ఫెస్ట్ 5కె రెడ్‌రన్ మారథాన్ 2023 నిర్వహణపై గురువారం మాట్లాడుతూ కలెక్టరేట్ నుంచి అరసవల్లి కూడలి వరకు 5కె రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారథాన్‌లో 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు గల విద్యార్థులు పాల్గొనవాల్సి ఉన్నారు. మారథాన్‌లో విజేతలుగా నిలిచి వారికి నగదు బహుమతులు, ప్రోత్సాహకాలు అందజేస్తామని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.పది వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు, తృతీయ బహుమతిగా రూ5 వేలు అందజేస్తున్నట్లు ప్రకటించారు. కార్యాలయ పనివేళల్లో నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారానికి 9494474266 సెల్‌నంబరును సంప్రదించాలని అన్నారు.

తరగతి గదిలోని వర్షపునీటిలో చదువుతున్న విద్యార్థులు

నీటిలో పాఠాలు నేర్చుకునేదెలా!

ప్రజాశక్తి- పొందూరు

చిన్నపాటి వర్షానికే తరగతి గది కారిపోతుండడంతో చదువుకునేదెలా అంటూ పొందూరు మేజర్ పంచాయతీ పరిధిలోని ఎరుకుల కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు తరగతి గదిలో కూర్చోలేని పరిస్థితి నెలకొందన్నారు. తరగతి గది శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందని వారంతా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. నిత్యం నీరు కారిపోతుండడంతో తరగతి గది అంతా దుర్వాసన వస్తుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలంటూ కాలనీవాసులు కోరుతున్నారు.

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్, కళాశాల సిఎంఎస్ ఎక్సెన్స్ సెంటర్లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన బిటెక్ ద్వితీయ ఏడాది ఈసిఈ విభాగానికి చెందిన 210 మంది విద్యార్థులకు 'పిసిబి-డిజైన్' అనే అంశంపై ఆరు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. 'లైవ్ వైర్ సాఫ్ట్‌వేర్, డిజైన్ ఆఫ్ వేరియస్ సర్క్యూట్స్ ఇన్ లైవ్‌వైర్ సాఫ్ట్‌వేర్, పిసిబి-విజర్డ్ సాఫ్ట్‌వేర్, పిసిబి-లేఅవుట్స్ డిజైనింగ్, ఈజీ ఈడిఏ సాఫ్ట్‌వేర్, డబుల్ లెయర్డ్‌పిసిబి- డిజైన్' అనే అంశాలపై తమ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం వల్ల విద్యార్థులకు ఆయా రంగాల్లో ప్రత్యేక నైపుణ్యతలు నేర్చుకొనే వీలుంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్చిడి డాక్టర్ బి.రామారావు, ఎపిఎస్‌ఎస్‌డిసి స్పాక్ డాక్టర్ వి.అశోక్ కుమార్, ట్రైనర్ ఎం.ఉమామహేశ్వరరావు, ఈసిఈ విభాగ కో-ఆర్డినేటర్ ఇ.జయ, సిఎంఎస్ సెక్షన్ కో-ఆర్డినేటర్ కె.బి.అనూష పర్యవేక్షణలో ఈ తరగతులు తెలిపారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికం

ఇచ్ఛాపురం : దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

పలాస : సంతకం చేస్తున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నిరసనల రెండో రోజూ కొనసాగింది. అందులో భాగంగా జిల్లాలో పలు నియోజకవర్గ కేంద్రాల్లో 'బాబుతో నేను తోడుగా.. నియంతపై పోరాటానికి మేము సైతం' పేరిట నిరాహార దీక్షలను గురువారం చేపట్టారు.

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అప్రజాస్వామికమని జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమదాలవలస పట్టణంలోని టిడిపి కార్యాలయ ఆవరణలోని దీక్షా శిబిరం వద్ద సరుబుజ్జిలి మండల టిడిపి నాయకులు కార్యకర్తలు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రూ.330 కోట్లకు ఆరు కేంద్రాలు పెట్టగా, అదే గుజరాత్ రాష్ట్రంలో ఒక్కొక్క కేంద్రానికి రూ.150 కోట్ల చొప్పున 900 కోట్లు వెచ్చించారని గుర్తుచేశారు. సీమెన్ కంపెనీ జీఎస్‌టి ఉల్లంఘన చేయలేదని, తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, ఎవరికైనా ఎటువంటి అక్రమ చెల్లింపులు చేయలేదని ఆ కంపెనీ ఎండీ వివరణ ఇచ్చిన సంగతిని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీరుకట్ల విశ్వప్రసాద్, సరుబుజ్జిలి టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు శివ్వాల సూర్యం, నందివాడ గోవిందరావు, పల్లి సురేష్, పేడాడ వెంకటరమణ, తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు, ఎండ రామారావు, కొమనాపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో నిర్వహించిన నిరసన దీక్షలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, కాళ్ల ధర్మారావు, నందిక జాని, కాళ్ల జయదేవ్, సాలీనా ఢిల్లీ యాదవ్, లోపింటి పద్మనాభం, దక్ష్యత ఢిల్లీరావు, మణి చంద్ర ప్రకాష్, సంతోష్, సదానంద రోలో, సీపాన వెంకట రమణ, పత్రీ తవిటయ్య, జానకీరావు, కొండ శంకరరెడ్డి పాల్గొన్నారు. మ్యాక్స్ ఆటో యూనియన్ ప్రతినిధులు దీక్షకు సంఘీభావం తెలిపారు. ముందుగా బస్టాండ్ కూడలి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

రణస్థలంలో నిర్వహించిన రిలే నిరాహారదీక్షలో ఉత్తరాంధ్ర శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు, మత పెద్దలు మురపాక ప్రసాదరావు, షేక్ సలీం, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయం వద్ద నిర్వహించిన రెండో దీక్షకు సిపిఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి సంఘీభావం తెలిపారు. దీక్షలో కార్యక్రమంలో మండల అధ్యక్షులు శీర రమణయ్య, రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి చింతు సుధాకర్, టిడిపి అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, చిట్టి మోహన్, జి.ఎం.జె.బాబు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా క్షేమంగా ఇంటికి తిరిగి కోరుతూ వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం అయ్యప్ప ఆలయంలో టిడిపి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు పుచ్చ శోభారాణి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పుచ్చ ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ ఢిల్లేశ్వరీ హోమం నిర్వహించారు.

కోటబొమ్మాళి టిడిపి కార్యాలయం వద్ద చేపిన దీక్షలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ఎఎంసి మాజీ ఛైర్మన్ వెలమల విజయలక్ష్మి, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ నిరసనల రెండో రోజూ కొనసాగింది. అందులో భాగంగా జిల్లాలో పలు నియోజకవర్గ కేంద్రాల్లో 'బాబుకు తోడుగా.. నియంతపై పోరాటానికి మేము సైతం' పేరిట నిరాహార దీక్షలను గురువారం చేపట్టారు.

ఇచ్ఛాపురంలో నిర్వహించిన నిరసన దీక్షలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, కాళ్ల ధర్మారావు, నందిక జాని, కాళ్ల జయదేవ్, సాలీనా ఢిల్లీ యాదవ్, లోపింటి పద్మనాభం, దక్ష్యత ఢిల్లీరావు, మణి చంద్ర ప్రకాష్, సంతోష్, సదానంద రోలో, సీపాన వెంకట రమణ, పత్రీ తవిటయ్య, జానకీరావు, కొండ శంకరరెడ్డి పాల్గొన్నారు. మ్యాక్స్ ఆటో యూనియన్ ప్రతినిధులు దీక్షకు సంఘీభావం తెలిపారు. ముందుగా బస్టాండ్ కూడలి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

రణస్థలంలో నిర్వహించిన రిలే నిరాహారదీక్షలో ఉత్తరాంధ్ర శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్ కలిశెట్టి అప్పలనాయుడు, మత పెద్దలు మురపాక ప్రసాదరావు, షేక్ సలీం, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

పలాస టిడిపి కార్యాలయం వద్ద టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీలు నాయకులకు పూల దండలు వేసి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. అనంతరం బాబు కోసం బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించి మొదటి సంతకాన్ని గౌతు శిరీష పెట్టి తమ మద్దతు తెలిపారు. సాయంత్రం నల్ల బెలూన్లు విడిచి పెట్టారు. ఈ దీక్షలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, టిడిపి ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఢిల్లీరావు, శశిభూషణ్ పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అండమాన్‌లో జరుగుతున్న నిరాహార దీక్షలో కవిటి మండలానికి చెందిన బెందాలం విజయ కృష్ణ, సనపల కామేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అండమాన్ నికోబార్ స్టేట్ ఇన్‌ఛార్జి మాధవనాయుడు మాట్లాడుతూ చంద్రబాబుని విడుదల చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన కవిటి మండలానికి చెందిన టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్ : దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు

కవిటి : దీక్ష చేపడుతున్న టిడిపి నాయకులు

రవికుమార్‌కు అస్వస్థత

కారులో తరలిస్తున్న నాయకులు

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టులను నిరసిస్తూ సరుబుజ్జిలి మండల టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టిన చేపట్టారు. సాయంత్రం 3 గంటల సమయంలో సంఘీభావం తెలియజేయడానికి టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్ అక్కడకు చేరుకున్నారు. దీక్షా స్థలి వద్ద మాట్లాడి కూర్చున్న వెంటనే సొమ్మసిల్లి కింద పడిపోయారు. వెంటనే టిడిపి నాయకులు హుటాహుటిన జిల్లా కేంద్రంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పలు రకాల వైద్య పరీక్షలను నిర్వహించి ఎటువంటి ప్రమాదం లేదని ధ్రువీకరించి డిశ్చార్జి చేసి ఇంటికి పంపించేశారు. రవికుమార్ క్షేమంగా ఇంటికి చేరుకున్నారని, ఎటువంటి ప్రమాదం లేదని, నాయకులు ఆందోళనకు గురి కావద్దని టిడిపి కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

జ్వరాలపై అప్రమత్తం

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శివశంకర్

పొందూరు: గ్రామాల్లో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కింతలి పిహెచ్‌సి వైద్యాధికారి శివశంకర్ అన్నారు. మండలం లోని రాపాక హెల్త్‌వెల్‌నెస్ కేంద్రం-2లో గురువారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు, చిన్నారులకు గురువారం వైద్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అలాగే మంచం పట్టిన రోగుల ఇళ్లవద్దకు వెళ్లి చికిత్సను అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి జ్యోత్స్న, ఎఎన్‌ఎం వనజాక్షి, డిఇఒ గోవింద, ఆశా కార్యకర్తలు పుణ్యవతి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

రణస్థలం రూరల్ , లావేరు: ఈ నెల 5న గురుపూజోత్సవం సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం జిల్లా కేంద్రంలో కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద కలెక్టర్ చేతులు మీదుగా బెజ్జిపురం జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ అసిస్టెంట్, హిందీ పండిట్ రొంపివలస రామారావు అందుకున్నారు. ఈ సందర్భంగా బెజ్జిపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు సామవేదుల రమణ అధ్యక్షతన రామారావుకు గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామారావు పాఠశాలలో విద్యార్థులకు బోధనతోపాటు, జాతీయ భాష హిందీకి అంకితమయ్యారని పేర్కొన్నారు. సన్మానగ్రహీత మాట్లాడుతూ విద్యార్థులకు బోధనతోపాటు, హిందీ మంచ్ ద్వారా 20 ఏళ్లుగా జాతీయ భాష హిందీ ప్రచారానికి తాను చేస్తున్న కృషికి పురస్కారం లభించిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.గోపాలరావు, వి.వెంకటరమణ, కె.కిరణ్‌కుమార్, బి.రమణమూర్తి, టి.సుశీల, ఐ.సుధాకర్, దమయంతి, పద్మావతి, మురళి, చిరంజీవులు, వెంకటరావు పాల్గొన్నారు.

రామారావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

30న కవితల పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని పలు సమస్యల పరిష్కారంలో, సంఘ నిర్మాణంలో కృషి చేసిన కొత్తకోట రామలక్ష్మి వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల30న యుటిఎఫ్ ఆధ్వర్యాన కవితలు పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిశోర్‌కుమార్‌లు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఆధునిక సమాజ నిర్మాణంలో స్త్రీ పాత్ర అనే అంశంపై ఒక పేజీ మించకుండా కవిత ఉండాలని తెలిపారు. ఎస్.కిషోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి, యుటిఎఫ్ జిల్లా కార్యాలయం, ద్వారకానగర్, పాత ఎంప్లాయిమెంట్ కార్యాలయం దగ్గర, శ్రీకాకుళం-532001 అన్న చిరునామాకు ఈ నెల 25లోగా పంపాలన్నారు. విజేతలకు అక్టోబరు 2న జరుగు వర్ధంతి సభలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కవిత పోటీల్లో ఉపాధ్యాయులు పాల్గొవాలని కోరారు.

పింఛన్లకు అర్హతే ప్రామాణికం

ఆమదాలవలస : పింఛను కార్డులను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

అర్హతే ప్రామాణికంగా అర్హులకు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అందజేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డులో సామాజిక 566 మందికి పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా పింఛన్లను అందజేస్తున్నామని తెలిపారు. పింఛను కోసం కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని అన్నారు. వాలంటీర్లను సంప్రదిస్తే ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, ఎంపిడిఒ వాసుదేవరావు యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, బొడ్డేపల్లి రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్ బాబు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 43 మందికి నూతన పింఛన్లను ఎమ్మెల్యే రెడ్డి శాంతి పంపిణీ చేశారు. అంతకుముందు సిరుసువాడ సర్పంచ్ వలురౌతు పోలినాయుడు ఆధ్వర్యాన గ్రామస్తులు ఎంపిడిఒ ముఖద్వారా వద్ద ఎమ్మెల్యే కారును నిలుపుదల చేశారు. జగనన్న సురక్షలో ఇచ్చిన హామీ మేరకు రోడ్డు బాగు చేయాలని కోరారు. దీంతో ఏమీ సమాధానం చెప్పకుండా వెళ్లిపోవడంతో నిరసన చెందారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కమక భాగ్యవతి, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, ఎఎంసి చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసిలు, సర్పంచ్ కుంచాల రత్నాలు, ఐసిడిఎస్ పిఒ విమలకుమారి, సూపర్‌వైజర్ ఎల్.శాంతి కుమారి, ఎఒ బసవ రాంబాబు పాల్గొన్నారు. అనుకున్న సమయానికి ఎమ్మెల్యే రాకపోవడంతో అధికారులు, పింఛను లబ్ధిదారులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

టెక్కలి : మండలంలోని బొప్పాయిపురం, అక్కువరం సర్పంచ్‌లు గుజ్జు మోహన్‌రెడ్డి, పొట్నూరు భూలక్ష్మి నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి గుంట రాజేష్, సచివాలయ కార్యదర్శి పాల రవికుమార్ రెడ్డి, వర్ధన్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని మరువాడ పంచాయతీ-2లో వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు, ఎంపిటిసి సూరాడ రాజారావు నూతన పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో మరువాడ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు సూరాడ జోగారావు, సచివాలయం కన్వీనర్ గంట కుమార్, గృహసారథులు గంటా జనార్ధనరావు, చొక్కార వెంకటకృష్ణారావు, చొక్కర నూకయ్య, సూరాడ పున్నయ్య, చోడిపిల్లి గోపెమ్మ, కొవిరి ధర్మరావు పాల్గొన్నారు.

జలుమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్లను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి వాన గోపి, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య, మండల వైసిపి అధ్యక్షులు కనుసు సీతారాం, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షులు దామ మన్మథరావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షులు బుక్క లక్ష్మణరావు, అల్లాడ, చల్లవానిపేట పిఎసిఎస్ అధ్యక్షులు మొజ్జాడ శ్యామలరావు, పాగోటి రాజప్పలనాయుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పొన్నాన ముసలినాయుడు, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఎ.దామోదరరావు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని దుగానపుట్టుగలో సర్పంచ్ డి.భద్రాచలం 20 మందికి నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పి.రమేష్, డి.హేమారావు, ధర్మారావు, ఢిల్లీరావు, తులసీదాస్, జోగారావు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

కవిటి : పింఛను అందజేస్తున్న సర్పంచ్ భద్రాచలం

సంతబొమ్మాళి : పింఛన్ల కార్డులను అందజేస్తున్న నాయకులు

కొత్తూరు : కార్డులను చూపిస్తున్న పింఛనుదారులు

నౌపడ: సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం పంచాయతీలో నూతనంగా మంజూరైన పింఛన్లను సర్పంచ్ ప్రతినిధి వజ్జ గోపాలకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉమా పతి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీరామ్ వాలంటీర్లు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఇటీవల మంజూరైన కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అయా గ్రామాల సర్పంచ్‌లు పంపిణీ చేశారు. నగరంపల్లిలో 18 మందికి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు అమలపాడులో ఐదుగురికి సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, గరుడుబద్రలో 13 మందికి సర్పంచ్ గూడ ఈశ్వరరావు పంపిణీ చేశారు.

నందిగాం : నందిగాం సచివాలయంలో 11 నూతన పింఛన్లను ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి జడ్యాడ జయరామ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, నందిగాం-1 ఎంపిటిసి ప్రతినిధి విష్ణు, కార్యదర్శి లత, వెల్ఫేర్ అసిసెంట్ రామకృష్ణ నిరంజన్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కామాక్షి

పోషకాహారంతోనే ఆరోగ్యం

జలుమూరు: రోజూ పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం లభిస్తుందని సారవకోట ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ హెచ్.కె.కామాక్షి అన్నారు. మండలంలోని గంగాధరపేట అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందజేస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సీతారత్నం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చిత్తశుద్ధితో పనిచేయాలి

ఇచ్ఛాపురం : అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం కన్వీనర కె.శ్రీనివాసరావు సూచించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగరాణి ఆధ్వర్యాన గురువారం సమావేశం నిర్వహించారు. కార్యకర్తల విధులు, సమయపాలన, కేంద్రాల నిర్వహణ, బాలల భాధ్యతలు గురించి సూచించారు. అనంతరం సిడిపిఒ, ఎసిడిపిఒలు జగనన్న సురక్ష ఆరోగ్య కార్యక్రమంపై వివ రించారు. పోషకాహార ప్రాముఖ్యత, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు.

వైఎస్ఆర్ బీమా అందజేత

మెళియాపుట్టి : మెళియాపుట్టికు చెందిన నాగవంశం కిషోర్ ఇటీవల మృతి చెందారు. మృతుడి భార్య దేవికి వైఎస్ఆర్ బీమా వర్తించడంతో తక్షణ సాయంగా రూ.పది వేలను ఎంపిపి ప్రతినిధి పోలాకి జైమునిరావు గురువారం అందజేశారు. మండల కో-ఆప్షన్ మెంబర్ భాస్కర్‌దాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హరిసర్వోత్తమరావు జయంతి

చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న శ్రీనివాసరావు

లావేరు: మండలంలోని లావేరు శాఖాగ్రంథాలయంలో స్వతంత్ర సమరయోధులు, గ్రంథాలయ ఉద్యమ నాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 140వ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత హరిసర్వోత్తమరావు చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రాలో తొలి రాజకీయ ఖైదీగా పేరుగాంచిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు స్వతంత్ర సమరయోధుడిగా, పత్రికా రచయితగా, సాహితీకారుడిగా, గ్రంథాలయ ఉద్యమ నాయకుడిగా, ఆయన తెలుగుజాతికి బహుముఖ సేవలందించారని అన్నారు. 1930 నుంచి రాజకీయ కార్యక్రమాలు తగ్గించుకుంటూ తనకెంతో ప్రీతిపాత్రమైన 'గ్రంథాలయ ఉద్యమం' వైపు దృష్టి మలిచారని పేర్కొన్నారు. ఆంధ్రా గ్రంథాలయ సంస్థకు 1934 నుంచి జీవితాంతం అధ్యక్షుడిగా ఉన్నారన్నారు. గ్రంథాలయ కార్యకర్తలకు, వయోజన విద్య ఉపాధ్యాయులకు ఉపయోగపడే పుస్తకాలు రచించారని చెప్పారు. గాడిచర్ల జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, లిటిల్ స్కూల్ కరస్పాండెంట్ బి.నీలిమ, ప్రిన్సిపాల్ టి.బాలరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం సందర్శన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని చేపేనపేటలో ఉన్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని రీజనల్ టెక్నికల్ లీడ్ కె.ప్రకాష్, టెక్నికల్ ఆఫీసర్ జి.హేమసుందర్ గురువారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ఎల్.టు డిజిటల్‌గా పనిచేస్తున్న సురేష్ కాంపాక్ట్ బ్లాక్‌ను సందర్శించారు. వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. పంట గట్లపై కూరగాయల బహుళ పంటల సాగు గురించి రైతులు ఏ విధంగా స్పందిస్తున్నారు, శాశ్వత జీవామృతం కుండీలు ఏర్పాటు చేయడం వల్ల ఉపయోగాలను గురించి అడిగి తెలుసుకున్నారు. రబీ సీజన్‌లో పంటల సరళి ఏ విధంగా చేయాలనుకుంటున్నారు అన్న అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎన్ఎఫ్ఎ బాబాజీ, మాస్టర్ ట్రైనర్ లక్ష్మనాయుడు, చిరంజీవి, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నాగేశ్వరరావుకు సన్మానం

నాగేశ్వరరావును సత్కరిస్తున్న శ్రీరాములు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గృహనిర్మాణ శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగంలో 1985లో చేరి 38 ఏళ్ల పాటు నిర్విరామంగా సేవలందించి ఇటు ప్రజలు, ఇటు అధికారుల నుంచి మన్ననలను పొందిన డిఇఇ కొండవలస వెంకట దుర్గానాగేశ్వరరావు అభినందనీయుడని నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు కొనియాడారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృత్తిలో ఎటువంటి అవినీతి మచ్చలేకుండా ప్రజలకు నిరంతరం సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ విశ్రాంత చీఫ్ ఇంజినీర్ పల్లి శ్రీరాములు, రవిశంకర్, త్రినాథ్‌కుమార్, శ్రీనివాసరావు, శ్రీకాకుళం, టెక్కలి కార్యనిర్వాహక ఇంజినీర్లు కె.అప్పారావు, జి.రామ్మూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రకాష్

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పక్కాగా చేపట్టాలని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి మండలస్థాయి అవగాహన, కార్యాచరణ ప్రణాళిక సదస్సు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ నెల రోజులు పాటు జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మండలంలోని 18 సచివాలయాల పరిధిలో సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచించారు. కచ్చితంగా ప్రతి ఇంటినీ సందర్శించి పూర్తి సమాచారం యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.శేఖర్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, స్థానిక వైద్య సిబ్బంది, కార్యదర్శులు, ఎంఎల్‌పిహెచ్‌లు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితునికి ఆర్థికసాయం

కవిటి: గొంతు కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న కవిటికి చెందిన పొల్లాయి లక్ష్మీనారాయణకు అండమాన్‌లో ఉంటున్న కవిటి మండలానికి చెందిన అగ్నికుల క్షత్రియ సంఘం అండగా నిలిచింది. గురువారం స్థానిక ఉషోదయ యువజన సంఘం సభ్యులు, అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యుల చేతులు మీదుగా బాధితునికి రూ.30 వేలు అందించారు. అంతేకాకుండా కేన్సర్‌తో పోరాడుతున్న లక్ష్మీనారాయణకు దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, పొల్లాయి లక్ష్మణమూర్తి, పి.ఉమామహేశ్వరరావు, పి.సింహాచలం, లోకనాథం, రాము, ఉమాపతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న స్థానికులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

పొందూరు : మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

పొందూరు : ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. మండలంలోని వి.ఆర్.గూడెంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైస్ ఎంపిపి ప్రతినిధులు వండాన సూరపనాయుడు, కాకర్ల రాజారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కంపోస్టు కాలనీలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహరనాయుడు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వం అలవరుచుకోవాలి

టెక్కలి: విద్యార్థులు చదువుతో పాటు వివిధ విషయాలపైనా పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని మహాత్మాజ్యోతీబాపూల్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.దామోదరరావు అన్నారు. నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీలను గురువారం మైదానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లోనూ సాధించాలన్నారు. నియోజకవర్గ క్రీడా కన్వీనర్ బాడాన నారాయణరావు మాట్లాడుతూ టెక్కలి, నందిగాం, కోటబోమ్మాళి, సంతబొమ్మాళి మండలాల పరిధిలో సుమారు 53 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 180 మంది విద్యార్థులు పాల్గొరని, అందులో 48 మందిని జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, కాపల రఘునాథరావు,, కె.కె.రామిరెడ్డి, లక్ష్మణరాజా, యాగాటి త్రినాథరావు, ఆదిశేషు, జగ్గమ్మ, కుప్పిలి ప్రకాష్, నాగళ్ల రమేష్, ఆలివేణి పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పలాస : పలాస ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం నియోజకవర్గ స్థాయి వాలీబాల్ అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగంలో క్రీడాకారుల ఎంపిక చేపట్టారు. ఈ సందర్భంగా పలాస ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.దాశరథి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పాఠశాల క్రీడలు ఫెడరేషన్ కన్వీనరు పి.తవిటయ్య, పలాస మండల ఇన్‌ఛార్జి సిహెచ్.పద్మలోచనం, మందస మండల ఇన్‌ఛార్జి ఎస్.రామారావు, వజ్రపుకొత్తూరు మండల ఇన్‌ఛాజ్జి చంద్రశేఖర్, మొదటి జోన్ కార్యదర్శి పి.గజేంద్రరావు, ఎస్.పి.జోగారావు, సిహెచ్.రాంజీ, బి.శంకరరావు, ఆర్.శ్రీను పాల్గొన్నారు.